

## దరఖాస్తు గడువు పొడిగింపు

వికారాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విదేశీ విద్య ఉపకార వేతనాలకు దరఖాస్తు గడువు ఈ నెల 29వరకు పొడగించినట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి మల్లేశం ప్రకటనలో తెలిపారు. బీటెక్ పూర్తి చేసిన ఎస్సీ అభ్యర్థులు మాస్టర్స్ చదువేందుకు ప్రభుత్వం సూచించిన దేశాలలో విద్యనభ్యసించాలనుకునే వారికి ఉపకార వేతనం రూ.20 లక్షలు మంజూరు చేస్తారన్నారు. విద్యార్థులు విదేశాలలో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో దరఖాస్తు చేసుకొని ఐ-20 పొంది ఉండాలన్నారు.





వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్ఓ హరిప్రియ

## జిల్లాలో 27 గ్రూప్-1 పరీక్షా కేంద్రాలు

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థులు మొదటి పరీక్షకు ఉపయోగించిన హాల్ టికెట్‌ను మిగిలిన 6 పరీక్షలకు(ఈ నెల 21 నుండి 27 వరకు) ఉపయోగించాలని కలెక్టర్ గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గుర్తించబడిన 27 పరీక్ష కేంద్రాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందుకు హాల్ టికెట్లు అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాంలోకి అనుమతిస్తారని, మధ్యాహ్నం 1.30 గంటలకు గేట్లు మూసివేస్తారన్నారు. హాల్ టికెట్‌పై అతికించిన ఫొటో, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫొటో ఐడీ కార్డును మాత్రమే పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లాలన్నారు. సమాధానాలు బాల్ పాయింట్ పెన్(నీలం లేదా నలుపు)తో మాత్రమే రాయాలని సూచించారు. కాగా, పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ మేరకు గురువారం పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సీఎస్ శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 17,762 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్ఓ హరిప్రియలు పాల్గొన్నారు.



## మాస్టర్ ప్లాన్ - 2050 ఏర్పాటుకు కసరత్తు

- 25 ఏళ్ల అవసరాలకు సరిపడా వసతుల కల్పనకు ప్రణాళిక
- వచ్చే ఏడాది మార్చి నాటికి సిద్ధం కానున్న మాస్టర్ ప్లాన్
- గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత
- వికారాబాద్‌లో డిజిటల్ సర్వేకు శ్రీకారం



వికారాబాద్ జిల్లా కేంద్రం వ్యూ

# బల్దియాలకు మహర్దశ!

వికారాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు మహర్దశ పట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా' అనే నినాదంతో చేపట్టనున్న ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలకు మంచి రోజులు రానున్నాయి. రాబోయే 25 సంవత్సరాల నాటి అవసరాలకు సరిపడే విధంగా ఈ బల్దియాలకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ మున్సిపాలిటీలను ఆదేశించింది. గత ప్రభుత్వ హయాంలో 2040- మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసేందుకు చర్యలు చేపడుతుండగా, సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే 25 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ -2050 రూపొందించాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో పెరగనున్న పట్టణీకరణ, మునిసిపాలిటీల విస్తరణ, పెరగనున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను పరిగణనలోకి ఈ మాస్టర్ ప్లాన్ రూపొందించాలని నిర్ణయించారు. కొత్త మాస్టర్ ప్లాన్‌లలో చెరువుల అభివృద్ధికి బ్లూ- గ్రీన్, కాలుష్య నివారణకు గ్రీన్ మొబిలిటీ, ఉద్గారాల నివారణకు, సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించే విధంగా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

### వాణిజ్య కేంద్రాలుగా గుర్తింపు

వచ్చే 25 సంవత్సరాల్లో ప్రతీ మునిసిపాలిటీలో సమగ్రాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. రాబోయే రెండున్నర దశాబ్దాలకు అవసరమయ్యే మౌలిక వసతులను సిద్ధం చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించే దిశగా కార్యాచరణ ప్రారంభమైంది. ఈ ప్లాన్‌లో సమగ్ర రవాణా, ఆర్థిక ప్రణాళికలను కూడా భాగం చేయనున్నారు. బ్లూ-గ్రీన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద అన్ని మునిసిపాలిటీలకు నిధులు సమకూరనున్నాయి. చెరువుల సంరక్షణకు భారీగా నిధులు కేటాయించనున్నారు. తాండూరు, వికారాబాద్ మునిసిపాలిటీలు పెద్దవి కాగా, పరిగి, కొడంగల్ మునిసిపాలిటీలు గత ప్రభుత్వ హయాంలో ఏర్పడ్డాయి. తాండూరు, పరిగి వాణిజ్య కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. తాండూరు నుంచి సిమెంట్, నాపరాతి

- మిగతా 8వ పేజీలో..

## సెలవులకు ఇంటికొస్తే సర్పంచ్‌ను చేశారు

- అన్ని తరగతుల్లోనూ నాదే ఫస్ట్ ర్యాంక్
- ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా ఉండేది
- రాగి సంకటి, అంబలి టీ, టిఫిన్లు
- ఆధ్యాత్మిక చింతన, క్రమశిక్షణే విజయ రహస్యం
- ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### అప్పట్లో గ్రామంలో ఒకే ఒక డిగ్రీ హోల్డర్‌ను

*షాద్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అన్ని తరగతుల్లోనూ ఆయనే ఫస్ట్. క్లాస్ లీడర్‌గాను గుర్తింపు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం. కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి మరీ విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ అంటే మహా ఇష్టం. ఆటల్లోనూ అగ్రస్థానమే.. డిగ్రీ అనంతరం వచ్చిన వేసవి సెలవులు ఆయన జీవితాన్ని మార్చాయి. సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి శాసనసభలో అడుగుపెట్టిన ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇన్నర్‌వ్యూ.. ఆయన మాటల్లోనే..*

మా సొంతూరు షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని వీర్లపల్లి. తల్లిదండ్రులు కాసులబాద్ రాజయ్య, అంజమ్మ. మా ఇంట్లో నేనే పెద్ద. నాతో పాటు ముగ్గురు సోదరిమణులు. మాది వ్యవసాయ కుటుంబం. చిన్నతనం నుంచే నాకు చదువులపై ఆసక్తి ఎక్కువ. నిరుపేద కుటుంబం కావడంతో చదువుకోవడానికి పుస్తకాలు కొనలేని దుస్థితి. అయినా అమ్మానాన్నలు చదువులో ప్రోత్సహించారు. వాళ్ల ఆశయాలను గౌరవిస్తూ అన్ని తరగతుల్లోనూ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను. డిగ్రీ పూర్తి చేయడంతో పాటు, ఎంఏ, బీఈడీలో కూడా మంచి ర్యాంకుతో సీటు సంపాదించాను. కాగా, అనుకోని పరిస్థితుల్లో రాజకీయాల్లోకి అరంగేట్రం చేయాల్సి వచ్చింది. లేకుంటే ఏ ప్రభుత్వ ఉద్యోగిగానో స్థిరపడేవాడిని.

### క్లాస్ లీడర్‌గా అవకాశం

విద్య పట్ల నాకున్న ఆసక్తిని గుర్తించిన మా టీచర్లు నాకు క్లాస్ లీడర్‌గా అవకాశం ఇచ్చారు. 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు మా తరగతిలో నేనే క్లాస్ లీడర్‌ను. ఆ రోజుల్లో అది నాకు చాలా

మిగతా 7వ పేజీలో..



ఇన్నర్ వ్యూ

## బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- అక్కడికక్కడే ముగ్గురు దుర్మరణం
- అందులో ఇద్దరు విద్యార్థులు
- బీజాపూర్-హైదరాబాద్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

పూడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీజాపూర్-హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. పూడూరు మండల పరిధిలోని మేడికొండ గ్రామానికి చెందిన చింతమరి యాదయ్య కుమారుడు నవీన్‌కుమార్(20) వికారాబాద్‌లోని ఎస్ఏపీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం, బుడ్డముల్ల నర్సింహులు కొడుకు హర్షవర్ధన్(15) అనంతగిరిపల్లి సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. పూడూరు మండలం గొంగుపల్లికి చెందిన ఎం. ప్రవీణ్(20) మేడికొండలోని అమ్మమ్మ

- మిగతా 8వ పేజీలో..



ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా మృతదేహాలు

ప్రవీణ్, నవీన్, హర్షవర్ధన్(ఫైల్)



- రసాయనాలు లేకుండా కాయగూరల సాగు
- ఇంటిపై సుమారు 15 రకాల పంటలు
- తనతో పాటు స్నేహితులకూ పంచుతున్న వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న లక్ష్మణ్‌యాదవ్

## మిద్దే.. వ్యవసాయ క్షేత్రం

మార్కెట్లో ఏది కొందామన్నా కల్తీయే. డబ్బులు పెట్టి రోగాలు కొనుక్కున్నట్లు అవుతున్నది. కూరగాయలు, పండ్లను సైతం రసాయనాలతోనే ఉత్పత్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాను తినే పండ్లు, కూరగాయలు రసాయనాలు లేకుండా పండించుకోవాలని ఆలోచన చేశాడు మేడ్చల్‌కు చెందిన యోగా టీచర్ లక్ష్మణ్‌యాదవ్. అనుకున్నదే తడువుగా మిద్దెపై సేంద్రియ సాగు ప్రారంభించాడు. తన కుటుంబానికి సరిపడా పండించడమే కాకుండా తన మిత్రులకు కూడా పంచుతున్నాడు.

-మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):

- వివరాలు 7లో..

## అన్ని గ్రామాల్లో గ్రంథాలయాలు

- ఏర్పాటు చేసి, పుస్తకాలను సమకూరుస్తాం
- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- రూ.10 కోట్లతో అన్ని వసతులు కల్పిస్తాం: చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి
- గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

వికారాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం విద్యకు నిలయమని గ్రంథాలయాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ మాట్లాడుతూ గ్రంథాలయాల ఏర్పాటుకు స్థలం కేటాయించి అవసరమైన పుస్తకాలు తెప్పిస్తామన్నారు. అన్న గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. రూ.10 కోట్లతో ఇక్కడ నూతనంగా అన్ని సౌకర్యాలతో గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



రాజేశ్ రెడ్డిని సన్మానిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు

### అవసరమైన పుస్తకాలు సమకూరుస్తాం

డీలీల్లో 150 నివాసాల మధ్య మా తాత గ్రంథాలయం ఏర్పాటు చేశారని కలెక్టర్ ప్రతీక్ జైన్ గుర్తు చేశారు. తాను అక్కడే చదువుకుని ఈ రోజు ఈ స్థానంలో ఉన్నానన్నారు. గ్రంథాలయాలకు సంబంధించి నిధులు పుష్కలంగా ఉన్నాయని నిరుద్యోగులకు కావాల్సిన పుస్తకాలు అన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా మొత్తం త్వరలోనే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా మారబోతుందని తెలిపారు. అప్పా నుంచి మన్నెగూడ వరకు 4 లైన్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాబోతున్నాయని, జిల్లా మీదుగా అవుటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు కానుందన్నారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేశ్, నారాయణపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ విజయ్, నాయకులు సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి, రత్నారెడ్డి, కిషన్ నాయక్, రాంచందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు భూమిపూజ

జిల్లా కేంద్రంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం భూమి పూజ చేశారు. పట్టణంలోని రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలో అర ఎకరా స్థలంలో సుమారు రూ.4.76 కోట్ల వ్యయం అంచనాతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

వికారాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచం ఉన్నంత వరకు రామాయణం, వాల్మీకి చరిత్ర ఉంటుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణాన్ని రచించిన ఒక బోయ కులానికి చెందిన చోరుడు అయిన వాల్మీకి ఇచ్చిన స్ఫూర్తితో అనేక మంది రచయితలు, కవులుగా మారారన్నారు. ఇతిహాసాలోని సారాంశాలను ఈతరం పిల్లలకు అర్థమయ్యే విధంగా పాఠశాల కరిక్యులంలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఇలాంటి గొప్పవారి చరిత్రల గురించి తెలుసుకోవడం నేటి తరానికి అవసరమన్నారు. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

# సార్.. నాకు న్యాయం చేయండి

- కూతురి రెండో పెళ్లితో ఇబ్బందులొచ్చాయ్..
- పెట్రోల్ డబ్బాతో గిరిజన మహిళ ఆత్మహత్యాయత్నం
- బషీరాబాద్ ఠాణా ఎదుట ఘటన

బషీరాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సార్.. నా కూతురు రెండో పెళ్లితో తనకు ఇబ్బందులొచ్చాయి.. మీరే న్యాయం చేయాలని ఓ గిరిజన మహిళ వెంట తెచ్చుకున్న పెట్రోల్ డబ్బాతో పోలీస్‌స్టేషన్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన గురువారం వికారాబాద్ జిల్లా బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. బాధితురాలు దేవీబాయి తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్ మండలంలోని కొత్లాపూర్ గ్రామానికి చెందిన దేవీబాయికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు. ఆమె భర్త కొన్నేళ్ల కిందట చనిపోయాడు. దేవీబాయి తన పెద్ద కూతురు మధులత(19)ని అదే తండాకు చెందిన భీమ్‌జీ అనే యువకుడికిచ్చి పెళ్లిచేసింది. నాలుగు నెలలు తిరగక ముందే దేవీబాయి కూతురు తన ప్రేమికుడు (కంసాన్‌పల్లి తండా)కు చెందిన వినోద్‌చౌహాన్ అనే యువకుడితో భర్త ఇంటి నుంచి పారిపోయి తర్వాత వచ్చింది. ఈ విషయమై తండా పెద్దలు ఇరు కుటుంబాలతో పంచాయితీ పెట్టారు. దేవీబాయి అల్లుడి కుటుంబికులకు పెళ్లి ఖర్చుల కింద రూ.14 లక్షలు పరిహారంగా ఇవ్వాలని తండా పెద్దలు నిర్ణయిస్తూ అప్పట్లో రాతపూర్వకంగా పత్రం రాశారు. ఈ క్రమంలో కులపెద్దల సమక్షంలో యువతిని కంసాన్‌పల్లి తండా యువకుడు వినోద్‌తోనే రెండో పెళ్లి చేశారు. యువతి మొదటి భర్తకు ఇవ్వాల్సిన పెళ్లి ఖర్చు లు రెండో పెళ్లి చేసుకున్న వినోద్ కుటుంబికులు చెల్లించాలని పంచాయితీలో పెద్దలు నిర్ణయించినా ఇవ్వడంలేదని దేవీబాయి వాపోయింది. డబ్బుల కోసం మొదటి అల్లుడి కుటుంబికులు ఒత్తిడి చేస్తున్నారని దేవీబాయి పోలీస్‌స్టేషన్ వద్ద మొరపెట్టుకుంది. అక్కడున్న పోలీసులు పంచాయితీలో ఏం మట్లాడుకున్నారో మాకు తెలియదని, మేం ఏం చేస్తామని ఆమెతో చెప్పారు. దాంతో దేవీబాయికి ఏం చేయాలో తోచక అప్పటికే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ డబ్బాతో పోలీస్‌స్టేషన్ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించింది. పెట్రోల్ డబ్బా మూత తీసి ఒంటిపై పోసుకునే యత్నం చేస్తుండగా.. కానిస్టేబుల్ పరుగున వచ్చి డబ్బాను లాక్కున్నాడు. అక్కడే ఎస్సై గఫార్, ఏఎస్సై నారాయణ బయటకు వచ్చి దేవీబాయి కుటుంబికులకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. సాయంత్రం కులపెద్దలు బషీరాబాద్‌కు చేరుకొని మరోసారి పంచాయితీ పెట్టి అప్పట్లో ఇస్తామన్న డబ్బులు చెల్లించాలని వినోద్ కుటుంబికులను ఒప్పించడంతో వారు అంగీకరించారు.


పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ డబ్బాతో కూర్చొని రోదిస్తున్న దేవీబాయి

## డీటీసీ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ

వికారాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శిక్షణ అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు పోలీస్ అభ్యర్థులకు పరీక్షలకు సంబంధించిన విషయాలలో శిక్షణ అందించాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి అభ్యర్థులకు టర్మ్-2 వార్షిక పరీక్షల సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు.

# ‘డిజిటల్ క్రాప్ బుకింగ్’కు వీఏఏలను నియమించాలి

**స్పీకర్‌కు వ్యవసాయ విస్తరణ జేఏసీ నాయకుల వినతి**



స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తున్న వ్యవసాయ విస్తరణ జేఏసీ నాయకులు

వికారాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తీసుకొస్తున్న డిజిటల్ క్రాప్ బుకింగ్ పథకంలో భాగంగా ప్రభుత్వం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను నియమించాలని, వెయ్యి ఎకరాలకు ఒకరిని నియమిస్తే ఏఈవోలు అనుకూలంగా పనిచేసుకోవడానికి ఉంటుందని వ్యవసాయ విస్తరణాధికారుల (జేఏసీ) అధ్యక్షుడు ఐసాక్ హెరాల్డ్, కో-కన్వీనర్ కావ్యలు కోరారు. ఈమేరకు శుక్రవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఏ విధంగా డిజిటల్ క్రాప్ సర్వే జరుగుతుందో.. తెలంగాణలో కూడా నిర్వహించాలని కోరారు. ఏఈవోలు దాదాపు 60 శాతం మహిళలు ఉన్నారని, వారికి అసిస్టెంట్లను నియమిస్తే కొంత ధైర్యంగా ఉంటుందని, గ్రామాలకు సాఫీగా వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కో-కన్వీనర్లు సౌమ్య, రాజ్‌కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ సందీప్ కుమార్, అన్ని మండలాల వ్యవసాయ విస్తరణాధికారులు, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రపంచం ఉన్నంత వరకు రామాయణ, వాల్మీకి చరిత్ర ఉంటుందని, ఇతిహాసాల్లో మొదటిది రామాయణమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, ఏవో సునీల్, బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డి.కేశురాం, బోయ లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

## తపస్య, అభినయలకు స్వర్ణాలు

**డబ్ల్యూపీసీ తెలంగాణ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్**





తపస్య, అభినయ

హైదరాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): డబ్ల్యూపీసీ తెలంగాణ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో నూరినేని తపస్య రావు, ఎ.అభినయ స్వర్ణ పతకాలు కొల్లగొట్టారు. హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో బీరంగూడ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థిని తపస్యరావు 38 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణం సాధించింది. అదేవిధంగా డార్విన్ నెక్స్ జనరేషన్ స్కూల్ విద్యార్థిని అభినయ జూనియర్ కేటగిరీ 52 కిలోల విభాగంలో పసిడి పతకం కైవసం చేసుకుంది. వీరిని రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షురాలు ఇంటూరి రేఖ అభినందించారు.

## జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు తనిష్క్



తనిష్క్‌ను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

శంషాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని నారాయణ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న జజాల తనిష్క్ జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈమేరకు కళాశాల సిబ్బంది గురువారం రాత్రి తనిష్క్‌ను అభినందించారు. ప్రిన్సిపాల్ రాంబాబు మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతున్న తనిష్క్ జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికవవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాగా, అండర్-19 (70 కేజీల విభాగంలో) తెలంగాణ నుంచి 32 మంది ఎంపికయ్యారని, అందులో తనిష్క్ ఒకరని ఆయన తెలిపారు.

## పాంబండకు పోటెత్తిన భక్తజనం



కులకచర్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. ప్రతీనెల పౌర్ణమి సందర్భంగా హిందువులు పాంబండ గిరి ప్రదక్షిణను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. 22 నెలలుగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. మొదట్లో వందల సంఖ్యలో ప్రారంభం కాగా.. ప్రస్తుతం వేల సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. గురువారం పౌర్ణమి సందర్భంగా పెద్ద సంఖ్యలో పాంబండకు తరలి వచ్చారు. అనంతరం రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

# మిద్దే.. వ్యవసాయ క్షేత్రం

- రసాయనాలు లేకుండా కాయగూరల సాగు
- ఇంటిపై సుమారు 15 రకాల పంటలు
- తనతో పాటు స్నేహితులకూ పంచుతున్న వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న యోగా గురువు లక్ష్మణ్‌యాదవ్



కూరగాయల మొక్కలకు ఎరువు వేస్తున్న లక్ష్మణ్‌యాదవ్

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలో అయ్యప్ప ఆలయం సమీపంలో నివాసం ఉండే లక్ష్మణ్‌యాదవ్ యోగా గురువు. ప్రతీ రోజు మేడ్చల్ పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎంతో మందికి ఉచితంగా యోగా నేర్పిస్తుంటాడు. కృష్ణుడి భక్తుడైన లక్ష్మణ్‌యాదవ్ ఇంట్లో అన్నింటికీ మట్టి పాత్రలనే ఉపయోగిస్తాడు. తాగే గ్లాసు నుంచి తినే ప్లేటుతో పాటు వండే పాత్రలు కూడా మట్టివే. ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ వహించే లక్ష్మణ్‌యాదవ్ రసాయనాలు లేని కూరగాయలు పండించాలనే ఆలోచన వచ్చింది. ఆ వెంటనే తన ఇంటి మిద్దెపై చిన్న చిన్న మట్టి పాత్రలను ఏర్పాటు చేశాడు. ఒక్కో పాత్రలో ఒక్కో రకమైన కూరగాయల మొక్కలను నాటాడు. ఆవుపేడ తెప్పించి తొట్టెలను నింపేశాడు. వీటితో పాటు పలు రకాల ఆకు కూరల విత్తనాలను కూడా తొట్టెలలో చల్లాడు.

**శారీరక శ్రమతో పాటు ఉల్లాసం**

రసాయనాలు లేకుండా సేంద్రియ పద్ధతిలో మిద్దెపై కూరగాయలను సాగు చేసుకోవడం సంతోషంగా ఉంది. ప్రతీ రోజు గంటసేపు మిద్దెపైనే కూరగాయల మొక్కల కోసం కేటాయిస్తాను. శారీరకశ్రమతో పాటు మనస్సు కూడా ఉల్లాసంగా ఉంటుంది. ఒక్క రోజు డాబాపైకి వెళ్లకపోతే ఏదో వెలితి అనిపిస్తుంది. కాస్త మనస్సు పెడితే ప్రతీ ఒక్కరు తమ ఇళ్లపై ఇలాంటి తాజా కూరగాయలు పండించుకోవచ్చు. - లక్ష్మణ్ యాదవ్

### 15 రకాల కూరగాయల సాగు

వంకాయ, టమాట, కొత్తిమీర, పూదీన, పాలకూర, పుంటికూర, తోటకూర, తదితర 15 రకాల వరకు కూరగాయలను ఇంటపైనే పండిస్తున్నాడు. ఇందుకోసం ఓ ప్రత్యేక నీటి ట్యాంకును ఏర్పాటు చేసి చిన్న పైపు ఏర్పాటు చేశాడు. మొదట్లో తనకు సరిపోయే కూరగాయల సాగును ప్రారంభించినప్పటికీ క్రమేణా తన వద్దకు యోగా శిక్షణకు వచ్చే వారందరికీ కాయగూరలను పంచిపెట్టడం మొదలుపెట్టాడు. ప్రతి రోజు 5 గంటల నుంచి 7 గంటల వరకు యోగా కార్యక్రమం ముగిసిన తర్వాత ఇంటికి చేరుకుని గంటసేపు కూరగాయల మొక్కలకు నీటిని పెట్టడం, కూరగాయలు మొక్కల చుట్టూ ఏవైనా పిచ్చి మొక్కలుంటే తొలగించడం, కాసిన తాజా కూరగాయలు తెంపడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటాడు. ప్రతి రోజు తనకు శారీరకంగా పనితో పాటు తాజా కూరగాయలు కూడా లభిస్తుండటం పట్ల లక్ష్మణ్‌యాదవ్ ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన వద్దకు యోగా శిక్షణకు వచ్చే వారిని ఇంటికి తీసుకెళ్లి తాను పండిస్తున్న కూరగాయల చూపిస్తూ వివరిస్తున్నాడు.

## ఎయిర్‌పోర్టులో ‘అతిథి దేవోభవ’ ప్రారంభం

శంషాబాద్ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక శాఖ, జీహెచ్‌ఎంసీతో కలిసి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ‘అతిథి దేవోభవ’ కార్యక్రమాన్ని ఆర్జీఐఏ ప్రారంభించింది. గురువారం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిపుణుల కమిటీ, టూరిజం, హాస్పిటాలిటీ, మీడియా, షైన్, ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ కమిటీ ప్రభుత్వ పర్యాటక శాఖ, రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సహకారంతో అతిథి దేవోభవ రెండో ఎడిషన్‌ను ప్రారంభించారు. పర్యాటకులకు ఆత్మీయ స్వాగతం, సురక్షితమైన ప్రయాణాన్ని నిర్ధారించేందుకు ఆటో, క్యాబ్ డ్రైవర్‌ల నైపుణ్యాలు, పరిజ్ఞానాన్ని మెరుగుపర్చడమే ఈ కార్యక్రమ ఉద్దేశం అన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని 1000 మంది డ్రైవర్లకు మూడు రోజుల ఇంటెన్సివ్ కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. భద్రతా చర్యలను పెంచేందుకు క్యూఆర్ కోడ్ వ్యవస్థతో పాటు భద్రతా శిక్షణ కోసం పోలీసు శాఖతో భాగస్వామ్యం ఓ కీలక అంశమన్నారు. ఈ సందర్భంగా జీహెచ్ ఐఏఎల్ సీఈవో ప్రదీప్ ఫణికర్, ఎఫ్టీసీసీఐ అధ్యక్షుడు సురేశ్‌కుమార్ సింఘాల్ మాట్లాడుతూ నాంపల్లి, కాచిగూడ, ఎంజీబీఎస్, ఇమ్లీబన్, సికింద్రాబాద్, జూబ్లీ, ఎర్రగడ్డ బస్టాండ్‌లు, శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం తదితర ప్రాంతాల్లో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక పర్యాటకం, భద్రతా చర్యలను వివరించే క్యూఆర్ కోడ్‌లతో హాల్మార్క్ స్టిక్కర్లను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

# సెలవులకు ఇంటికొస్తే సర్పంచ్‌ను చేశారు

(5వ పేజీ తరువాయి)

గర్వంగా ఉండేది. ఆ సమయంలో క్లాస్‌లోనే కాదు.. జీవితంలోనూ లీడర్‌గా ఎదుగుతావని తన స్నేహితులు అన్న విషయాలు ఇప్పుడు గుర్తుకువస్తున్నాయి. క్లాస్ లీడర్ అయినందుకో ఏమో కానీ లీడర్‌గా ఎదిగినందుకు చాలా ఆనందంగా ఉంది. ఆధ్యాత్మిక చింతన, క్రమశిక్షణే నా విజయ రహస్యం.

### ఇంటర్ వరకు కాలినడకే

మా స్వగ్రామం వీర్లపల్లిలో 5వ తరగతి వరకు చదివాను. ఆ తర్వాత ఆ గ్రామం నుంచి రోజు రానుపోను 10 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి నందిగామ గ్రామం(ప్రస్తుతం మండల కేంద్రం)లోని ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదివాను. అదే ఉత్సాహంతో మళ్లీ 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న షాద్‌నగర్ పట్టణానికి నడుచుకుంటూ వెళ్లి ఇంటర్ పూర్తి చేశాను. ఇంటర్‌లో ఫస్ట్‌క్లాస్‌లో పాసవ్వడంతో చదువులపై ఆసక్తి పెరిగింది. ఎలాగైన మంచి ఉద్యోగం సంపాదించాలన్న తపనతో హైదరాబాద్‌లోని సిటీ కాళాశాలలో బీకాం పూర్తి చేశాను. అందులోనూ ఫస్ట్ క్లాస్‌లో పాస్ కావడంతో ఎంఏలో సీటు వచ్చింది. అదే సమయంలో బీఈడీ కోర్సులో కూడా సీటు వచ్చింది. నాకు క్రీడల పట్ల కూడా ఆసక్తి ఎక్కువ. ప్రతీ రోజు స్నేహితులతో కలిసి క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ ఇలా రోజు ఏదో ఒక ఆట ఆడేవాళ్లం. ఇందులోనూ కూడా నాదే లీడర్‌షిప్.

**పూర్తి శాఖాహారిగా..**

నాకు రాగి సంకటి.. అంబలి చాలా ఇష్టం. మేము మొదట మాంసాహారులమైనప్పటికీ 1986 నుంచి పూర్తి శాఖాహారిగా మారాను. ప్రతీ రోజు ఇంట్లో రాగి సంకటి తిని, అంబలి సేవించిన తర్వాతనే ఇంటి నుంచి కాలు బయట పెడుతాను. మధ్యాహ్నం భోజనంలో ఏదైనా కూర, పప్పు, పెరుగు మాత్రమే తీసుకుంటాను. రాత్రి వేళలో కూడా జొన్న రొట్టె, లేదా చపాతి ఇతర వెజిటేరియన్ కర్రీస్‌తో తింటాను.



కుటుంబ సభ్యులతో వీర్లపల్లి శంకర్

### గ్రామ పెద్దల ప్రోత్సాహంతోనే..

నా డిగ్రీ 1995లో పూర్తయింది. అనంతరం వేసవి సెలవులని ఇంటికి వచ్చాను. అదే సమయంలో సర్పంచ్ ఎన్నికలు వచ్చాయి. సర్పంచ్ పదవిని బీసీలకు కేటాయించారు. దీంతో మాజీ ఎమ్మెల్యే రాందేవ్‌రెడ్డి తనను ఎన్నికల బరిలో నిలబడమని సూచించాడు. వెంటనే నాకు ఇష్టం లేదని చెప్పాను. ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సంపాదించాలన్నదే నా లక్ష్యమని చెప్పాను. ఆ సమయంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో నీవు ఒక్కడివే డిగ్రీ పూర్తి చేసిన యువకుడవు.. చదువుల్లో మాదిరిగానే రాజకీయాల్లోనూ రానిస్తావంటూ గ్రామ పెద్దలు పాలకొంల్లు నారాయణరెడ్డి, శేఖర్‌రెడ్డి నవాజ్‌రెడ్డి ఎన్నికల బరిలోకి దిగేలా ప్రోత్సహించారు. ఆ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసిన నేను అందరి సహకారంతో సర్పంచ్‌గా గెలిచాను. అక్కడి నుంచే నా రాజకీయ ప్రస్థానానికి పునాది పడింది. అప్పటి నుంచి చదువులు స్వస్తి పలికి రాజకీయాలకు అంకితమయ్యాను.

**సరదాగా స్నేహితులతో..**

వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు నా ప్రాణ మిత్రులు. చిన్నతనంలో సెలవులు వచ్చాయంటే వారతో కలిసి షాద్‌నగర్ పట్టణానికి నడుచుకుంటూ వెళ్లి సినిమాలు చూసేవాళ్లం. కానీ ఎప్పుడూ కూడా క్లాసులు ఎగ్గొట్టి సినిమాలు, శికారులకు వెళ్లలేదు. అందుకే తమకు క్రమశిక్షణ గల విద్యార్థులుగా ఉపాధ్యాయులు గుర్తించారు. నా స్నేహితులు సైతం ఇప్పటికీ నాతోనే రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. మాజీ మంత్రి శంకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, సీనియర్ నేత ఎల్లారెడ్డి నాకు రాజకీయ గురువులు. నన్ను మండల పార్టీ అధ్యక్షుడిగా, జిల్లాలో కమిటీ సభ్యులుగా ఇలా ఎన్నో పదవులు ఇప్పించారు. రాజకీయాల్లో తనకు ప్రత్యేక గుర్తింపు వచ్చేలా చేసింది కూడా వారే. వారివల్లనే నేను ఈ స్థాయికి ఎదిగాను.



స్నేహితులతో కలిసి వీర్లపల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వీర్లపల్లి శంకర్ (ఫైల్)

## ఉపాధ్యాయులను కేటాయిస్తేనే స్కూల్‌కు విద్యార్థులు

**పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపిన విద్యార్థులు, తల్లిదండ్రులు**





ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బషీరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్త ఉపాధ్యాయులను నియమించకుండా ఇక్కడి ఉపాధ్యాయుడిని ఎలా రిలీవ్ చేశారంటూ బషీరాబాద్ మండలం పర్వత్‌పల్లి ఎంపీపీఎస్ విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఆందోళనకు దిగారు. అంతటితో ఆగకుండా విద్యార్థులను బయటకు తీసుకొచ్చి పాఠశాలకు తాళం వేసి, ఉపాధ్యాయులను నియమించాలంటూ ఆందోళన చేశారు. పర్వత్‌పల్లి ఎంపీపీఎస్‌లో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు 103మంది విద్యార్థులున్నారు. ప్రైమరీ పాఠశాలలో 66 మంది విద్యార్థులకు గాను ముగ్గురు టీచర్లున్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ఒక ఉపాధ్యాయుడు బదిలీ కాగా.. ఇంతకాలం రిలీవ్ చేయకుండా ఇక్కడే ఉంచారు. డీఎస్సీలో భాగంగా ఇక్కడ కేటాయించకపోగా బదిలీ అయినా ఉపాధ్యాయుడిని రిలీవ్ చేశారు. దాంతో తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని హెచ్‌ఎం రాఘవరెడ్డిని ప్రశ్నించగా.. తన పరిధిలో ఆ విషయం లేదని, ఉన్నతాధికారులతో మాట్లాడి చెబుతానన్నారు. కాగా, ఇద్దరు టీచర్లతో ఐదు తరగతులు ఎలా బోధిస్తారని, ఉపాధ్యాయులను నియమించే వరకు మా పిల్లలను పాఠశాలకు పంపించేదిలేదంటూ తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లిపోయారు. చేసేదేమీ లేక టీచర్లు పాఠశాల సమయం వరకు అక్కడే ఉండి వెళ్లిపోయారు. హెచ్‌ఎంను ఆరా తీయగా ఉపాధ్యాయుల కోసం ఆందోళన దిగినట్లు తెలిపారు. ఎంఈవోకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

## ల్యాబ్ టెస్ట్‌కు నారపల్లి పెద్దచెరువు నీరు

- సేకరించిన పీసీబీ అధికారులు
- కలుషిత వ్యర్థ రసాయన జలాలు కలుస్తున్నాయనే విజ్ఞప్తి మేరకు పరీక్షలకు..



నీటిని సేకరిస్తున్న అధికారి, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఘట్‌కేసర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధి నారపల్లి పెద్ద చెరువు నీటిని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరీక్షించేందుకు గాను సేకరించారు. గురువారం అధికారి మహేష్ సిబ్బందితో వచ్చి చెరువు నుంచి నీటిని సేకరించి రెండు గాజు సీసాలు, ఒక ప్లాస్టిక్ డబ్బాలో పట్టి భద్రపరిచారు. పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపుతామని, రిపోర్టు ఆధారంగా చెరువు నీటిలో ఎలాంటి రసాయనాలు కలుస్తున్నాయో తెలుస్తుందని ఆయన తెలిపారు. కాగా, చెంగిచెర్ల కబేళా నుంచి కలుషిత వ్యర్థ రసాయన జలాలు దిగువకు వదిలిపెడుతుండటంతో నారపల్లిలోని చెరువులు పూర్తిగా కలుషితం అవుతున్నాయని ఇటీవల పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి అధికారులకు విన్నవించారు. నారపల్లి చెరువులోకి కబేళా నీరు చేరడంతో పరిసరాలు కలుషితం అవుతున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులకు, మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. దాంతో అధికార సిబ్బంది నీటి శాంపిళ్లను సేకరించారు. మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రెడ్డియానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్ రవీందర్, నాయకులు శ్రీనివాస్, నర్సింహ, అక్రంఅలీ, బాల్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.204 కోట్లు మంజూరు

- సీఎం రేవంత్ సహకారంతో కల్వకుర్తికి మహర్దశ
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో బీటీరోడ్ల నిర్మాణానికి రూ.204 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు. నియోజకవర్గ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా రోడ్ల అభివృద్ధి, ఆధునీకరణకు నిధులు మంజూరు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యానాయక్, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి డి.మోహన్‌రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటు, రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి మహర్దశ ఏర్పడిందని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలో ఆరు రోడ్ల విస్తరణకు రూ.189 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు కసిరెడ్డి వెల్లడించారు. వెల్దండ మండలం కొట్రగేటు నుంచి కల్వకుర్తి వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణకు రూ.30 కోట్లు, వెల్దండ నుంచి సిరసనగండ్లకు డబుల్ రోడ్డుకు రూ.40కోట్లు, జూపల్లి నుంచి వంగూరు గేటు వరకు రూ.9కోట్లు, ఆమనగల్లు మండలం కోనాపూర్ గేటు మాడ్గుల వరకు 21 కిలోమీటర్ల డబుల్ రోడ్డు విస్తరణకు రూ.45కోట్లు, ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లి నుంచి చంద్రాయన్‌పల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.30కోట్లు, తలకొండపల్లి చౌరస్తా నుంచి కొట్రగేటు వరకు రోడ్డు విస్తరణకు రూ.35కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే వివరించారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ ద్వారా నాలుగు పనులకు రూ.15కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మాడ్గుల మండల కేంద్రంలో అంతర్గత సీసీ, డ్రైనేజీల నిర్మాణానికి రూ.7.75కోట్లు, వెల్దండ మండలం రాచూరు తండా నుంచి తిమ్మినోనిపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్లు, కల్వకుర్తి రోడ్డు నుంచి ఎంగంపల్లి మీదుగా మార్చాల వరకు బీటీరోడ్డుకు రూ.5కోట్లు నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని జీపీలు, గిరిజన తండాల నుంచి మండల కేంద్రాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.100 కోట్ల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, వారం రోజుల్లో విడుదలవుతాయని తెలిపారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సభలో కేసీఆర్ అనేక హామీలు ఇచ్చినా కాగితాలకే పరిమితమయ్యాయని, వాటిని సాధించడంలో అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విఫలమయ్యారని ఆరోపించారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశానని జైపాల్ యాదవ్ గొప్పగా చెప్పుకోవడమే తప్ప నియోజకవర్గానికి సాధించిందేమీ లేదన్నారు. కాగా, సీఎం రేవంత్, మంత్రులు సీతక్క, వెంకట్‌రెడ్డిలకు కసిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు హన్మనాయక్, కాను శ్రీనివాస్‌రెడ్డి, మండ్లీ రాములు, గూడూరు భాస్కర్‌రెడ్డి, చందోజీ, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, బీచ్యనాయక్, జగన్, మానయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కసిరెడ్డి కృషి అభినందనీయం

కల్వకుర్తి నియోజకవర్గ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రహదారు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయించడం అభినందనీయమని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈమేరకు శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో సత్కరించారు.





బషీరాబాద్‌లో ఎమ్మెల్యే సోదరుడి కాన్వాయ్‌ని ముందుకు పంపి వెనక వెళ్తున్న ఎస్కార్ట్ వాహనం

## ఎమ్మెల్యే సోదరుడికి ఎస్కార్ట్!

**బషీరాబాద్‌లో చర్చనీయాంశమైన పోలీసుల తీరు**

బషీరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే సోదరుడు, కాంగ్రెస్ నాయకుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డికి బషీరాబాద్ పోలీసులు ఎస్కార్ట్ పెట్టడం స్థానికంగా చర్చనీయాంశమైంది. గురువారం బషీరాబాద్‌లో దుకాణాల ప్రారంభోత్సవానికి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి కాన్వాయ్‌తో వచ్చారు. ఇదిచూసిన పలువురు స్థానికులు ఎమ్మెల్యే తమ్ముడికి ఏ హోదాలో పోలీసులు ఎస్కార్ట్ ఇచ్చారనే దానిపై చర్చించుకున్నారు. ఎస్సై విలేకరులను గమనించి ఏఎస్సై ఆధ్వర్యంలోని కాన్వాయ్‌ని వెనక్కు వెళ్లాలని సూచించారు. అనంతరం ఈ విషయమై బషీరాబాద్ ఎస్సైని వివరణ కోరగా.. ఎమ్మెల్యే వస్తున్నారనే సమాచారంతో సిబ్బంది.. ఎస్కార్ట్ ఇచ్చేందుకు వెళ్లారని, కాని కార్యక్రమానికి ఎమ్మెల్యే సోదరుడు రావడంతో వెనక్కు వచ్చారని చెప్పారు.

# అంధకారంలో కాలనీలు

● ఆరు నెలలుగా తీరని సమస్య ● సాకులు చెబుతూ పట్టించుకోని అధికారులు ● ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

తాండూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో ఆరు నెలలుగా వీధి దీపాలు వెలుగక ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోజూ ఏదో ఒక వార్డు నుంచి ప్రజలు స్థానిక కౌన్సిలర్‌కు స్ట్రీట్ లైట్లు వెలుగడం లేదని ఫిర్యాదు చేస్తున్నారు. నెలల తరబడి ఇంజనీరింగ్ విభాగం అధికారులు లైట్లులేవని చెతులెత్తేయడంతో కౌన్సిలర్లు ప్రజలకు ఏంచెప్పలేక తలపట్టుకుంటున్నారు. మెటీరియల్ లేదని స్టాఫ్ తక్కువగా ఉందని సాకులు చెబుతూ కాలం వెల్లదీస్తున్నారు. సెప్టెంబరు 27న మున్సిపల్ ఏఈ ఖాజా హుస్సేన్ రెండు రోజుల్లో మెటీరియల్ వస్తుందని అన్ని వార్డుల్లోకొత్త లైట్లు వేస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నిర్వహించిన కౌన్సిలర్ల సమీక్షలో చెప్పారు. అయితే 20రోజులు అయినా మెటీరియల్ రాక పోవడం లైట్లు వెలగకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాండూరు మున్సిఫ్ కోర్టు నుంచి శాంతిమహల్ చౌరస్తా వరకు, జూనియర్ కళాశాల ముందు, హైదరాబాద్ రోడ్డు మార్గం, గంగోత్రి విద్యాలయం వెనుక భాగం, ఐటీ రోడ్డు మార్గం, వేంకటేశ్వర కాలనీల్లో వీధిలైట్లు వెలగడంలేదు. అదేవిధంగా పాతతాండూరు గడి, వేంకటేశ్వర స్వామి ఆలయం, రైల్వేస్టేషన్ సమీపంలో, సాకారిపేటలో, బసవన్న కట్ట, పాండురంగ ఆలయం వద్ద వీధి దీపాలు వెలగడంలేదు.


తాండూరులోని 7వ వార్డులో వెలగని వీధి దీపాలు

ఇప్పటికైనా వీధి దీపాలు వెలిగేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## న్యూస్ బాక్స్

### వేతనాలు పెంచండి


కడా అధికారికి వినతి పత్రం అందజేస్తున్న భగీరథ కార్మికులు

కొడంగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తమకు కనీస వేతనం పెంచాలని కోరుతూ మిషన్ భగీరథ కార్మికులు గురువారం కొడంగల్‌లో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పెట్రోల్ అలవెన్స్, వారంలో ఒకరోజు సెలవు ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని కడా అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్ల పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్

వికారాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారందేవరంపల్లిలో ఎంపీ నిధుల ద్వారా చేపట్టిన ఐదు సీసీరోడ్ల పనులను గురువారం అదనపు కలెక్టర్ సుధీర్ పరిశీలించారు. అనంతరం గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, అంగన్‌వాడీ సెంటర్ పనులను పరిశీలించారు. అదనపు కలెక్టర్‌తో పాటు ఎంపీడీవో వినయ్‌కుమార్, ఎంపీవో దయానంద్, పీఆర్డీఈలు, ఈఈలు అధికారులు ఉన్నారు.

### డీబీఎస్‌యూ మండల కమిటీ

కొడంగల్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన శ్రామిక యూనియన్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం సాయిలు తెలిపారు. పట్టణంలోని అతిథిగృహంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎస్.సతీష్(పాటిమీదిపల్లి), ఉపాధ్యక్షుడిగా ఎర్పుల రాములమ్మ(పెద్దనందిగామ), కార్యదర్శిగా అనంతప్ప(అన్నారం), ప్రధానకార్యదర్శిగా ఎం.వెంకటమ్మ(సంగాయిపల్లి), కోశాధికారిగా ఎం.ఇస్తప్ప(ప్యాలమద్ది), సలహాదారుగా కుర్వ పద్మ(చిట్లపల్లి), 18 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు లింగం సాయిలు ఈ సందర్భంగా తెలిపారు.

## నిరాశ, నిస్పృహల నడుమ

## కొలువుదీరిన మార్కెట్ కమిటీ

మేడ్చల్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ నాయకుల నిరాశ, నిస్పృహల నడుమ మేడ్చల్ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం కొలువుతీరింది. చైర్మన్‌తో పాటు సభ్యుల నియామకం పట్ల పార్టీలో కొనసాగుతున్న తీవ్ర అభ్యంతరాల మధ్య కమిటీ గురువారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టింది. అయితే, ప్రమాణ స్వీకారం పట్ల స్థానిక కాంగ్రెస్ నేతల మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. సమాచారం ఉన్నప్పటికీ కొందరు దూరంగా ఉన్నారు. నూతన పాలకవర్గంలో అవకాశం దక్కకపోవటంతో పలువురు నాయకులు మొదటి నుంచీ నిరాశ వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఇటీవల ఇందిరమ్మ కమిటీల నియామకాల సందర్భంగా కార్యకర్తల సమావేశంలో మేడ్చల్ మండలానికి చెందిన పలువురు నేతలు మార్కెట్ కమిటీలో స్థానం కల్పించకపోవటం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో ఎలాగోలా స్థానిక నేతలను సముదాయించిన పార్టీపెద్దలు సమావేశం నిర్వహించారు. మరుసటి రోజే హంగూఆర్భాటం లేకుండా కమిటీ నూతన పాలకవర్గంతో గుండ్లపోచంపల్లి కండ్లకోయలోని మార్కెట్‌కమిటీ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేయించారు. అయితే నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ ఒక్కరే కార్యక్రమానికి హాజరు కావటం పట్ల స్థానిక నేతలు మండిపడుతున్నారు. ప్రస్తుతం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నర్సింహులు.. వజ్రేష్ యాదవ్‌కు సన్నిహితుడు కావటంతో ఈ విషయంలో పక్షపాత ధోరణిలో వ్యవహరించారంటూ కొందరు నేతలు వాపోయారు. మొక్కుబడిగా గురువారం ఉదయం సమాచారమిచ్చి హాజరు కావాలని కోరినట్లు మండలానికి చెందిన ఓ సీనియర్ కాంగ్రెస్ నేత తెలిపారు.

# ఘనంగా వాల్మీకి జయంతి


మేడ్చల్ ప్రతినిధి: జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో వాల్మీకి జయంతి

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధికారులు పి.రాజేశ్వర్, యం.డి.యాసిన్ అలీ, హనుమంత్, వాల్మీకి సంఘం అధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షుడు రాములు తదితరులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**మేడ్చల్ టౌన్:** వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రిదీపిక నర్సింహారెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు జాకట దేవరాజ్, నాయకులు పాల్గొన్నారు.

**మోమిన్‌పేట్:** ఎన్కతలలో గురువారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘంసభ్యులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం, శ్రీశైలం, జగన్, బుచ్చయ్య, రవీందర్, జగన్, పాండు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్‌లు ముల్లి పావని జంగయ్య యాదవ్, బోయపల్లి కొండల్‌రెడ్డి ఆయన చిత్రపటంకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, రెడ్డియానాయక్, కమిషనర్లు ఎండీ సాబేర్ అలీ, వీరారెడ్డి పాల్గొన్నారు.

**కీసర రూరల్:** మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గురువారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయాల్లో నాగారం, దమ్మాయి గూడ మున్సిపల్ చైర్మన్లు కౌకుంట్ల చంద్రారెడ్డి, వసుపతి ప్రణీత, కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**పరిగి:** వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం పరిగి మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, కమిషనర్ వెంకటయ్యలు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వారాల రవీంద్ర, నరేష్ పాల్గొన్నారు.

**తాండూరు రూరల్:** మండల పరిధిలోని కరన్‌కోట్‌లో వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని స్థానికులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోయ అశోక్, లాలప్ప, తిరుపతి, సుధాకర్, నర్సింహులు, కృష్ణ, రవీందర్, అనిల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### గంజాయి పట్టివేత

మర్పల్లి, అక్టోబరు 17: మండల కేంద్రంలో గంజాయి పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ సహదేవుడు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మోమిన్‌పేట్ ఎక్సైజ్ పోలీసులు మండల కేంద్రానికి చెందిన జిలకర్ర రాజశేఖర్ వద్ద 133గ్రాముల ఎండు గంజాయిని గుర్తించి పట్టుకున్నారు. గంజాయికి బానిసైన రాజశేఖర్ బీదర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా గంజాయిని కొనుగోలు చేస్తున్నాడని విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ సహదేవుడు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ రేఖ, సిబ్బంది నర్సింహులు, జ్ఞానేశ్వర్, రాజశేఖర్, శ్రీశైలం, అనిల ఉన్నారు. సీఐ మాట్లాడుతూ గంజాయి సాగు, విక్రయాలు చేపడుతున్నట్లు తెలిస్తే 8712658752 నెంబరుకు సమాచారం అందించాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

### ఆటోపై విరిగిపడిన చెట్టు

● డ్రైవర్ పరిస్థితి విషమం


చెట్టు పడటంతో ధ్వంసమైన ఆటో

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ప్రయాణిస్తున్న ఆటోపై చెట్టు విరిగిపడ టంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. యాదాద్రీ-భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం, మక్తా అనంతారంకు చెందిన మునుకుంట్ల పెంటయ్య(60) ఆటో డ్రైవింగ్ చేస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన ఓ ప్రయాణికురాలును ఆటోలో ఎక్కించుకోని భువనగిరికి వెళ్లుతుండగా ఘట్‌కేసర్‌లోని మాధవరెడ్డి బ్రిడ్జి సమీపంలో ప్రమాదవశాత్తు చెట్టు ఆటోపై పడింది. ఈ ఘటనలో పెంటయ్యకు తీవ్ర గాయాలు కాగా ప్రయాణికురాలుకు స్వల్పగాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు అతన్ని మెరుగైన వైద్యం కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

### బైక్‌ను ఢీకొన్న ఆటో.. వ్యక్తికి గాయాలు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): యాపిల్స్ విక్రయించడానికి వెళుతున్న టీవీఎస్ ఎక్సెల్ బైక్‌ను ఆటో ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరుశురామ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంకుశాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ సత్తార్(50) ఎక్సెల్‌పై యాపిల్స్ విక్రయిస్తుంటాడు. గురువారం ఎప్పటిలాగే అవుషాపూర్ నుంచి ఇంటికి వస్తుండగా గ్రీన్‌పార్కు ఫంక్షన్‌హాల్ సమీపంలో అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్తార్‌కు కాలు విరిగి, తలకు గాయమైంది. యాపిల్స్ చెల్లాచెదురుగా పడిపోయాయి. కుటుంబసభ్యులు స్థానికుల సాయంతో సత్తార్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### ప్రమాణ స్వీకారోత్సవంలో జేబుదొంగ

వికారాబాద్, అక్టోబరు 17: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో గురువారం పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి ప్రమాణ స్వీకారం జరిగింది. అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరైన కార్యక్రమంలో హాల్ మొత్తం నిండిపోవడంతో ఓ జేబుదొంగ చొరబడ్డాడు. ఇది గమనించిన కొందరు ఆ జేబు దొంగను పట్టుకుని అక్కడే ఉన్న పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు ఆదొంగను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## బల్దియాలకు మహర్దశ!

(5వ పేజీ తరువాయి)

ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు రవాణా అవుతాయి.

**విద్యుత్ వాహనాలకు ప్రోత్సాహం**

పరిగి, కొడంగల్ పట్టణాల మీదుగా బీజాపూర్ హైవే ఉండడంతో గూడ్స్ వాహనాల రాకపోకల కొనసాగుతూ ఉంటాయి. వాహనాల రాకపోకలతో వాతావరణ కాలుష్యం ఏర్పడకుండా నివారించేందుకు బ్లూ - గ్రీన్ ప్రాజెక్టు అమలుకు చర్యలు చేపట్టనున్నారు. ప్రతి మునిసిపాలిటీ పరిధిలో బ్లూ - గ్రీన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో భాగంగా గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించనున్నారు. వరదల నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, హరిత వనాల పెంపకం వంటివి చేపడతారు. గ్రీన్ మొబిలిటీ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో కాలుష్యాన్ని నివారించేందుకు విద్యుత్ వాహనాలను వినియోగించేలా ప్రోత్సహించనున్నారు. రద్దీ అధికంగా ఉండే చోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణం చేపడతారు. నిర్మాణ రంగంలో కర్బన ఉద్గారాలు వెలువడకుండా సోలార్ విద్యుత్ వినియోగం, ఆధునాతన పర్యావరణ పరిరక్షణ వంటి గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాలు చేపడతారు.

రాష్ట్రంలో తొలిసారిగా వికారాబాద్ మునిసిపాలిటీలో మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వే ప్రారంభించారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్, సర్వే ఆఫ్ ఇండియా, డీటీసీపీ, మునిసిపల్ ఉన్నతాధికారులు డ్రోన్లకు పూజలు నిర్వహించి డిజిటల్ సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి డిజిటల్ సర్వేపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులు అవగాహన కల్పించారు. వికారాబాద్ పట్టణంలో డ్రోన్ కెమెరాల సహాయంతో తాజా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయనున్నారు.

**సమస్యలు లేని మున్సిపాలిటీలే లక్ష్యం**

కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద తొలి విడతలో రాష్ట్రంలో 50 వేల నుంచి లక్ష జనాభా కలిగిన 20 మున్సిపాలిటీల్లో మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వే నిర్వహించేందుకు ఎంపిక చేయగా, వాటిల్లో వికారాబాద్ ఒకటి కావడం విశేషం. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో భాగంగా మునిసిపల్, సర్వే ఆఫ్ ఇండియా, డీటీసీపీ అధికారుల పర్యవేక్షణలో సర్వే చేపడతారు. సమస్యలు లేని మునిసిపాలిటీలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే మాస్టర్ ప్లాన్ రూపొందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఉపగ్రహాల సాయంతో మునిసిపాలిటీ పరిధిలో ప్రాంతాల వారీగా ఉపరితలాల ఎత్తులు, పరిస్థితులు, రోడ్లు, భవనాలు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, సెల్ టవర్లు, టాయిలెట్లు, రిజర్వాయర్లు, మార్కెట్లు, వైకుంఠధామాల వంటివి విభాగాల వారీగా చిత్రాలు సేకరించి బేస్ మ్యాపులు తయారు చేస్తారు. ఈ మ్యాపుల ఆధారంగా భవిష్యత్తులో 30, 40 సంవత్సరాల అవసరాలకు తగినట్లుగా కొత్త మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

(5వ పేజీ తరువాయి)

ఇంటికి వచ్చాడు. ఈ ముగ్గురు గురువారం మెడికొండ గ్రామంలోని చౌరస్తాలో కలిశారు. నవీన్ కళాశాలకు, హర్షవర్ధన్ స్కూల్‌కు వెళ్లాల్సి ఉంది.

**బోరున విలపించిన తల్లిదండ్రులు**

అయితే అదే సమయంలో ప్రవీణ్ బైక్‌పై మన్నెగూడ వైపు వెళుతున్నాడు. బస్సు వెళ్లిపోవడంతో ప్రవీణ్ బైక్‌పై నవీన్, హర్షవర్ధన్ మన్నెగూడ వరకు వెళ్లేందుకు ఎక్కారు. ముగ్గురూ మేడికొండ నుంచి బయలుదేరారు. బీజాపూర్-హైదరాబాద్ జాతీయ రహదారిపై పూడూరు గేట్ శివారులో ఎదురుగా వస్తున్న హైదరాబాద్-1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మధుసూదనరెడ్డి హుటాహుటిన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతుల కుటుంబీకులు అక్కడకు చేరుకుని తమ పిల్లల మృతదేహాలను చూసి బోరున విలపించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాద స్థలాన్ని వికారాబాద్ జిల్లా సంఘటనా స్థలాన్ని ఎస్పీ నారాయణరెడ్డి, డిప్యూటీ ఆర్ఎం రాజు, వీఎన్‌డీఎస్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రావు, వీ అండ్ ఎస్‌వో మహంకాళీ రాంమూర్తి, చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాస్‌రెడ్డి, పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. విషయం తెలుసుకున్న తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి తదితరులు పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# గందరగోళంలో మున్సిపల్ కార్మికులు

● రెండు షిఫ్టులు రద్దు చేయాలని ఆందోళన
● కమిషనర్ అంగీకరించినట్లు చెప్పిన మున్సిపల్ ఉద్యోగి
● విధుల్లో చేరాక మాటమార్చడంతో కార్మికుల ఆగ్రహం


ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఘట్‌కేసర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండు షిఫ్టుల పని విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఘట్‌కేసర్ మున్సిపల్ కార్మికులు చేపట్టిన ఆందోళన రెండో రోజు గురువారం కొనసాగింది. ఉదయం 5గంటల నుంచి 9గంటల వరకు ఆందోళన చేపట్టిన అనంతరం ఒకషిఫ్టులో పనిచేయడానికి కమిషనర్ అంగీకారం తెలిపారని, కార్మికులు విధుల్లో చేరాలని మున్సిపల్ ఉద్యోగి చెప్పారు. దీంతో కార్మికులు యథావిధిగా విధుల్లో చేరారు. మధ్యాహ్నం విధులు ముగించే సమయానికి అలా ఎవరు చెప్పారని, సాయంత్రం 4గంటల వరకు పనిచేయాల్సిందేనని మున్సిపల్ ఉద్యోగి మాటమార్చి చెప్పడంతో కార్మికులు అవాక్కయ్యారు. అధికారులు ఇష్టానుసారంగా మాట్లాడుతూ తమను తప్పుదోవ పట్టించడంపై కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయమై యూనియన్ నాయకులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామన్నారు.

# మినీ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


పరిగి: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

తాండూరు రూరల్, అక్టోబరు 17: మినీ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తాండూరు ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం మినీ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏసీడీపీవోకు అంగన్‌వాడీ టీచర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో నాయకులు యు.బుగ్గప్ప, బేబిరాణి, మినీ అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, లలిత, మంగ్లీబాయి తదితరులు పాల్గొన్నారు.

**పరిగి:** పరిగిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని మినీ నుంచి మెయిన్ కేంద్రాలుగా మారిన అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ, మంజుల, స్వరూప, శ్వేత, నిర్మల, కమలాదేవి, శాంతి, సునీత, రుక్మిణిబాయి తదితరులు పాల్గొన్నారు.

### మల్లన్న సేవలో మాజీ ఎమ్మెల్యే దంపతులు

తాండూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం భ్రమరాంభ మల్లికార్జున సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, ఆర్తిరెడ్డి దంపతులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి పెళ్లిరోజును పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు.

### దిర్సంపల్లిలో వీధినాటకం

దోమ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిర్సంపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి మహత్యం వీధి నాటకం నిర్వహించారు. గ్రామస్థులు కోరిక మేరకు కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ వీధి నాటకానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వీధి నాటకానికి ఆమె ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో జీడీ లింగయ్య, లక్ష్మీనారాయణ, నవాజ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నాటకోపాధ్యాయులు రాములు పాల్గొన్నారు.

### నేటి నుంచి కార్తీక మాసం

తాండూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నేడు (శుక్రవారం) ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఆలయాల్లో నవంబరు 15వ తేదీ వరకు ప్రత్యేక పూజలు జరగనున్నాయి. పూజలు, వ్రతాలు, దీక్షలు, దీపారాధనలు ప్రారంభం కానున్నాయి. సోమవారం తెల్లవారు జామున శివాలయాలు, భక్తులు దర్శించుకుని కార్తీక దీపాలను వెలిగిస్తారు. విష్ణువుకు చాలా ఇష్టమైన మాసంగా భావించి కార్తీక మాసంలో వన భోజనాలకు ప్రాధాన్యత ఇస్తారు. మరోవైపు నేటి నుంచే అయ్యప్ప స్వామి మాలధారణ ప్రారంభం కానుంది.

## సంక్షిప్తంగా..

● **మోమిన్‌పేట్:** పశువులకు సోకే గాలి కుంటు వ్యాధి నివారణకు రైతులు ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి సదానందం తెలిపారు. మండలంలోని ఎన్కెపల్లి, ఎన్కతల, చంద్రయాన్‌పల్లి, అమ్రాదికలాన్ గ్రామాల్లో గురువారం 813 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

● **తాండూరు రూరల్:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ శివారులోని ప్రభుత్వభూమి సర్వేనెంబర్-109లో 26 ఎకరాలభూమిని వేలం నిర్వహించగా కొనుగోలు చేసిన భూ యజమానులు అట్టి భూమికి హద్దులను ఏర్పాటు చేస్తుండగా బుధవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఓ భూయజమాని గురువారం గ్రామస్తులతో భేటీ అయ్యాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కొనుగోలు చేసినట్లు గ్రామస్తులకు కొనుగోలు చేసిన డాక్యుమెంట్లు చూపించాడు.

● **పరిగి:** మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ మునిసిపల్ పరిధిలోని పలు కాలనీల్లో గురువారం పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

● **కులకచర్ల:** మండలంలోని చాపలగూడెం గ్రామానికి చెందిన గండి చిన్న భీమయ్య(65) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి అంత్యక్రియలకు గ్రామ మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సాయన్న, కొండ రాములు, నర్సింహులు, చాపలగూడెం మాజీ సర్పంచ్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● **కులకచర్ల:** లాల్‌సింగ్ తండాకు చెందిన గోపాల్‌నాయక్ అనారోగ్యానికి గురికాగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సీఎం సహాయ నిధి నుంచి రూ.లక్షా50వేలు మంజూరు చేయించారు. ఆచెక్కును గురువారం డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి తండాకు వెళ్లి గోపాల్‌నాయక్‌కు అందజేశారు.

● **మూడుచింతలపల్లి:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మూడుచింతలపల్లి మండల అధ్యక్షుడిగా లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన ఉద్యమకారుడు మంద స్వామిముదిరాజ్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ చైర్మన్ చీమ శ్రీనావాస్ నియామకపత్రాన్ని గురువారం అందజేశారు.

● **ఘట్‌కేసర్:** మున్సిపాలిటీ 7వ వార్డులోని ఆర్టీకే కాలనీలో పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి గురువారం రూ.6లక్షలతో చేపట్టిన చిల్డ్రన్ పార్కు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

● **పూడూరు:** కండ్లపల్లిలో రాష్ట్ర విశ్వవిద్యాలయం తాండూరు ప్రాంతీయ పరిశోధన కేంద్ర ఆధ్వర్యంలో గురువారం శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం 15మంది రైతులకు ఉచితంగా కుసుమ విత్తనాలు అందజేశారు.

● **కులకచర్ల:** కులకచర్ల నుంచి గురువారం అయ్యప్పమాలధారులు పాదయాత్రగా శబరిమలకు బయల్దేరి వెళ్లారు. పాంబండ ఆలయంలో మోత్కుర్ చెన్నయ్య, పవన్‌ప్రసాద్‌లు మాలధారణ చేసి అయ్యప్ప ఆలయంలో పూజలుచేసి పాదయాత్ర ప్రారంభించారు. వారిని అయ్యప్ప సేవా సమితి సభ్యులు సన్మానించారు.

### ఒకే గ్రామంలో ఐదుగురికి టీచర్ కొలువులు

● రెండు కుటుంబాలకు చెందిన నలుగురు

కొడంగల్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని దుద్యాల్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన ఐదుగురు డీఎస్సీ ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించి ఎస్జీటీ, ఎస్ఏ గణితంలో ఉపాధ్యాయ కొలువులు సాధించారు. గ్రామానికి చెందిన కోట్ల శ్రీశైలంగౌడ్ కుమార్తెలు కోట్ల సుధా(ఎస్ఏ గణితం), కోట్ల శ్రీకావ్య(ఎస్జీటీ), ఆర్ఎంపీ డాక్టర్ ఎస్.బిచ్చప్ప కుమార్తెలు గౌతమి(ఎస్జీటీ), ప్రసన్నలక్ష్మి(ఎస్జీటీ), మాజీ సైనికుడు ఎంట్ల కృష్ణ కుమారుడు ఎంట్ల సునీల్‌కుమార్(ఎస్జీటీ)లకు ప్రభుత్వ కొలువులు రావడంతో కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు వారిని అభినందించారు.

**విద్యనభ్యసించిన పాఠశాలకే టీచర్‌గా**

బొంరాస్‌పేట్: దుద్యాల మండలంలోని లగచర్లకు చెందిన కావలి రమేశ్ జడ్పీహెచ్ఎస్ దుద్యాల పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ పరీక్షా ఫలితాల్లో ఉద్యోగం సాధించాడు. కౌన్సెలింగ్‌లో జడ్పీహెచ్ఎస్ దుద్యాల పాఠశాలకు కేటాయించడంతో తిరిగి అదే పాఠశాలకు టీచర్‌గా వచ్చాడు.

### వైభవంగా చండీహోమం

కులకచర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా గురువారం మండలంలోని పుట్టపహడ్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో చండీ హోమం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. లక్ష్మీ ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. సొసైటీ చైర్మన్ మొగులయ్య, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, డీసీసీబీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శేరి రాంరెడ్డి, పీరంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

కులకచర్ల, అక్టోబరు 17: గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని మిషన్ భగీరథ జిల్లా ఎస్ఈ ఆంజనేయులు తెలిపారు. కులకచర్లలో గ్రామీణ తాగునీటి సరఫరా సహాయకులకు మిషన్ భగీరథ ఆధ్వర్యంలో 4వ రోజు శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించి శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు చలమరెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

**మోమిన్‌పేట్:** మండలంలోని జాఫర్‌పల్లి నీటి శుద్ధి కేంద్రంలో భగీరథ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు భగీరథ ఈఈ చల్మారెడ్డి గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తాగునీటి సరఫరాపై సలహాలు, సూచనలు చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో సర్టిఫికెట్లు అందజేశారు.

### ఆకట్టుకున్న కళా ఉత్సవం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫైన్ ఆర్ట్స్ (మేడ్చల్) పాఠశాలలో గురువారం నిర్వహించిన కళా ఉత్సవం ఆకట్టుకుంది. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని డాన్స్, వాయిద్యం, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్, వోకల్, విజువల్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్స్ అంశాలపై పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు జిల్లా విద్యాధికారి విజయకుమారి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీధర్, నోడల్ అధికారి పాపిరెడ్డి, ప్రిన్సిపాల్ మధులత, వైస్ ప్రిన్సిపాల్ రాములు పాల్గొన్నారు.

### బీజేపీ సభ్యత్వానికి అనూహ్య స్పందన

పరిగి/యాలాల, అక్టోబరు 17: బీజేపీ సభ్యత్వానికి అనూహ్య స్పందన లభిస్తుందని బీజేపీ పరిగి పట్టణ ప్రధానకార్యదర్శి వార్ల ఆంజనేయులు అన్నారు. పరిగి మునిసిపల్ పరిధిలోని మూడో వార్డులో గురువారం బీజేపీ సభ్యత్వాన్ని చేయించారు. యాలాలలోని సంగెంఖుర్దులో గురువారం మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేశం, మండల అధ్యక్షుడు యాదగిరి తదితరులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు చేశారు.